


# లాహోర్ రణం

మంచు మందంగా కురుస్తోంది.

కొండలు, చెట్లు, చేమలు తెల్లటి బురఖా వేసుకున్నట్లు వింతగా దర్శనమిస్తున్నాయి.

కార్గిల్ మంటలు ఇంకా చల్లారలేదనేందుకు గుర్తుగా అప్పుడప్పుడూ ఫిరంగులు పేలుతూ మంటలు విరజిమ్ముతున్నాయి. తుపాకుల శబ్దాలు సరేసరి. విరామం తెలియనట్లు మ్రోగుతూనే ఉన్నాయి.

లాహోర్ ఒప్పందం మత్తులో ప్రమత్తంగా ఉన్న భారత్ సైన్యం భారీ మూల్యం చెల్లిస్తున్న తరుణమది. రాజకీయనిర్ణయాల మీద ఆధారపడటం వల్ల ఇలాంటి అనర్థాలు తప్పవు. అవతల దేశం మిలట్రీపాలనలో తక్షణ నిర్ణయాలు తీసుకునే స్థితిలోఉండి, యుద్ధరంగంలో అధిక్యతను విస్తృతంగా ప్రదర్శిస్తోంది.


**కాటూరు రవీంద్రత్రివిక్రమ్**

ఎవరు శాంతి సమయంలో అధిక స్వేదం చిందిస్తారో – వారు యుద్ధంలో తక్కువ నెత్తురు చిందిస్తారనేది మిలట్రీ సామెత.

(The More you sweat in peace, The less you bleed in war)

యుద్ధం ఎప్పుడో వస్తుంది కదా అని అంతవరకూ సిపాయిలు అలక్ష్యంగా ఉండరాదు. సిపాయిది నిత్యసమరం. శత్రువులు అనేక విధాలుగా మనకు హాని కలిగిస్తూంటారు. గూఢచారులుగా మన రక్షణ రహస్యాలు సేకరిస్తూంటారు. మన ఆయువుపట్టులయిన ఆయుధా

గారాలను విద్రోహచర్యలతో ధ్వంసం చేస్తుంటారు. (ఇలాంటి సంఘటనలు మూడు జరిగాయి!). ఇవి ప్రత్యక్షంగా, పరోక్షంగా (ఏజెంట్ల ద్వారా) కూడా జరుగుతుంటాయి. భారత్‌లో అన్నివైపులా తమ పంచమాంగ దళాలను, I.S.I ఏజంట్లను, తొత్తులను పాకిస్థాన్ విస్తృతంగా వినియోగిస్తోంది. జర్మనీ లాగ గూఢచార, ఉగ్రవాద వ్యతిరేకుల్ని సమర్థవంతంగా ఏరిపారెయ్యలేకపోవటం మన అసమర్థత. యుద్ధవిజయాలమీద వీటి ప్రభావం చాలా ఉంటుంది.



సిపాయిలు శత్రువులమీద వీరోచితంగా పోరాడగలరు. కానీ, వెన్నుపోటు పొడిచే దేశద్రోహుల కుట్రల వల్ల సైన్యపటిమకు చేటు కలిగే ప్రమాదం ఉంది. అందువల్ల అంతరంగ భద్రత ఎంతో ముఖ్యం.

కార్గిల్ యుద్ధంలో అలలు అలలుగా (Waves after waves) మన సైన్యం రంగంలోకి దిగుతూనే మృతుల్నీ, క్షతగాత్రుల్నీ వెనక్కి పంపిస్తూ, తాజాగా సైనికదాడుల్ని చేయసాగింది.

కొత్తపటాలం యుద్ధరంగంలో అడుగుపెట్టే ముందు ఆనవాయితీగా ఇష్టదైవ ప్రార్థనలు ఇలా ఉంటాయి–

"భగవంతుడా! యుద్ధంలో నా దేశానికి విజయం ప్రసాదించు. నా శత్రువుల మీద నాకు ఆధిక్యతనివ్వు. నేను వీరస్వర్గం పొందటం అనివార్యమైతే, అత్యధికంగా శత్రువుల్ని అంతమొందించే అవకాశం నాకు కలిగించు..."

సిపాయి రాథోడ్ ఇలాంటి ప్రార్థనే చేసాడు. అతనితో బాటు ఇరవైమంది సహచరులున్నారు.

శిఖరం మీద తిష్ఠవేసిన చొరబాటుదారుల్నీ, శత్రువుల్నీ మట్టుబెట్టి, స్థావరాలను కైవశం చేసుకునేందుకు జట్లు జట్లుగా పటా

విడగొట్టారు.

ఒక జట్టులో రాథోడ్ ఉన్నాడు.

రాథోడ్ సాహసానికి మారుపేరు. పట్టుదల స్వభావం. అనుకున్నది సాధించే వరకూ విశ్రమించడు. ఈ విషయం సహచరులందరికీ బాగా తెలుసు. అందుకే అతన్నందరూ 'పులిబిడ్డ' అంటుంటారు. అతని తండ్రి కూడా సైన్యంలో పనిచేసి ప్రస్తుతం పెన్షన్ తీసుకుంటున్నాడు.

భారతసైన్యం అప్పటికే వ్యూహరీత్యా అత్యంతకీలకమైన టోలోలింగ్ పర్వతశ్రేణిని నాటకీయంగా జరిపిన మెరుపుదాడిలో స్వాధీనం చేసుకుంది. కోడిమెడలాంటి టోలోలింగ్ శత్రువుల చేతిలో ఉంటే ద్రాస్ సెక్టర్‌ని, 'లే' ప్రాంతాన్నీ మిగిలిన కాశ్మీరులోయ నుండే వేరుచేయగల అవకాశం ఉండేది. ఈ ప్రాంతం చేజారిపోవటంతో పాకిస్థాన్ కంగుతిన్నది. అయినా వాస్తవాధీన రేఖ వెంబడి పలు ప్రాంతాలలో గల శిఖరాలపై బలిష్టమైన బంకర్లు నిర్మించుకుని పాకిస్థాన్ సైనికులు, చొరబాటుదార్లు భారతసైన్యాన్ని చికాకు పరుస్తున్నారు. ఈ ప్రాంతాలను తిరిగి కైవసం చేసుకోవడమే ప్రస్తుత కర్తవ్యం. చైనా యుద్ధంలో ఎదురైన చేదుఅనుభవాల్నే కార్గిల్‌లో కూడా భారత్ సైనికులు ఎదుర్కొంటున్నారు. సైనిక అవసరాల పట్ల శ్రద్ధలేని ప్రభుత్వాలు యుద్ధరంగంలో వినియోగించడానికి ఎంతో అవసరమైన అధునాతన పరికరాల్ని ఎంతకాలానికీ అందజెయ్యక పోవటం సైనికుల పాలిట శాపమైంది. ఎక్కువ మంది సైనికులు వీరస్వర్గమలంకరించడానికి ఈ లోపం ఒక ప్రధాన కారణం. మిగతా కారణాల్లో భద్రతగురించి తగు వ్యూహాన్ని రచించుకోలేకపోవటం, శత్రువు శిఖరంమీద ఆధిక్యతతో ఉండటం, చొరబాట్ల గురించి ఆలస్యంగా తెలుసుకోవటం ఉన్నాయి.

> సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.
>
> ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధవీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

వాస్తవాధీన రేఖ దాటి వెళ్ళి, చొరబాటుదార్లకు సైనిక సరఫరాలు రాకుండా అడ్డుకోదలచిన సైన్యం ప్రతిపాదనను ప్రభుత్వం అంగీకరించలేదు. దీనివల్ల యుద్ధం ఇతర ప్రాంతాలకు విస్తరించవచ్చనే అనుమానం ఉంది. అదే జరిగితే ఇరుదేశాల మధ్యా మరొక పూర్తిస్థాయి యుద్ధం జరగవచ్చు. అప్పుడు వినాశనం చాలా ఎక్కువ ఉంటుంది. 1971 అనుభవాలు మనకి ఉండనే ఉన్నాయి. అందువల్ల ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది.


అయితే ఈ సహనం వల్ల ప్రపంచదేశాల మద్దతు మనకు దండిగా లభించింది. జి-8 దేశాలు పాకిస్థాన్ మీద గట్టిగా వత్తిడి చేయసాగాయి. అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ పాకిస్థాన్‌తో చాలా కటువుగా, కఠినంగా వ్యవహరిస్తూ, త్వరగా వాస్తవాధీనరేఖకు ప్రాధాన్యత నిచ్చి, వైదొలగాలని ఆదేశించడం భారత్‌కి బాగా లాభించింది.

అలాగని పాకిస్థాన్ వెంటనే తన పట్టుసడ లించడానికి సుముఖంగాలేదు. నవాబ్ షరీఫ్ చైనా మద్దతు కోసం బీజింగ్ వెళ్లి, భంగపాటు తో తిరిగివచ్చారు. చైనా వంటరిగా పాకిస్థాన్‌కి మద్దతు తెలిపితే, ప్రపంచ దేశాల మధ్య దౌత్య పరంగా, ప్రతిష్ఠపరంగా బలహీనపడుతుంది. అందుకే మొండి చెయ్యిచూపించింది.

ఇప్పుడు పాకిస్థాన్ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిగా ఉంది. పరువు నిలు పుకునేందుకు పట్టుదలగా కార్గిల్ కొండలమీద కోతిలా కూర్చుంది.

బోఫోర్స్ శతఘ్నులు భారీగా ఫిరంగి గుళ్లు కురిపించి, శత్రువుకి తీరని నష్టం కలిగించా యి. సమయానికి సరిపడా విడిభాగాలు లేక పదిశాతం ఫిరంగులు స్తబ్దంగా ఉండగా, వాటి లోని భాగాలను తీసి అవసరమైన చోట్ల విని యోగించారు. మందుగుండు సామాగ్రిని భార త్ అధిక మూల్యం చెల్లించి, (ఒక్కొక్క షెల్‌కి 43 వేల రూపాయలు) దిగుమతి చేసుకోనారం భించింది. దీనివల్ల పోరాట పటిమకు కావా ల్సిన మద్దతు తక్కువైంది. ఈ స్థాయి ఎదురు దాడికే కార్గిల్ కొండల గుండెలు దద్దరిల్లిపో యాయి. చొరబాటుదార్లు కకావికలైపోయారు. పాకిస్థాన్ సైనికుల దేహాలు మాంసపుముద్దలై పోయాయి. మిగిలిన వారు పట్టుదల వీడకుం డా బంకర్లలో తలదాచుకుంటూ, మధ్యమధ్య మన సైనికుల మీద దాడులు చేస్తున్నారు. వాళ్ల వద్ద సమృద్ధిగా తేనె, నెయ్యి వంటి ఆహారప దార్థాలు నిల్వ ఉన్నాయి. వాటిని ఆరగిస్తూ యుద్ధం కొనసాగిస్తున్నారు.

రాథోడ్ సహచరులు శిఖరం వైపు ఎక్కటం ప్రారంభించారు. పైనుండి వచ్చే తూటాలకు జవాబుగా తూటాలు ప్రయోగిస్తున్నారు. రాథో డ్ మనసులో ఒకటే లక్ష్యం! తన నూత్న వధు వు రాజశ్రీ కోరినట్లు విజయంతో స్వీట్లు తీసు కుని ఇంటికి వెళ్లాలి. ఆమె పల్లెటూరి యువతి అయితేనేం, దేశం గురించి చాలా విషయాలు ఉత్తేజకరంగా మాట్లాడుతుంది. 'జై జవాన్, జై కిసాన్' నినాదాలతో పాటలుకూడా పాడుతుం ది. ఆమె తండ్రి వ్యవసాయంలో దిట్ట. ఎన్నో ప్రయోగాలతో అధిక ఫలసాయం సాధించి, పలు బహుమతులు కైవసం చేసుకున్నాడు.





సహచరులతో శిబిరంవైపు వెళ్తున్న సిపాయి రాథోడ్

ఆమె తండ్రికి తగిన తనయ. పెరట్లో కూరగాయల పాదులన్నీ ఆమె పాతినవే. ఆమె చెయ్యి మహత్యం - కూరగాయలు విరగ కాస్తుంటాయి. రోజుకో కొత్తరకం కూరతో, రోజూ విందు భోజనం పెడ్తుంది రాజశ్రీ - నవ్వుకున్నాడు రాథోడ్.

అంత దూరంలో గ్రైనేడ్ పేలటంతో ఉలిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చాడు రాథోడ్. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు తగల్లేదు. ఇక లాభం లేదనుకుని - "పదండి సోదరులారా... ముందుకు పదండి" అంటు రాథోడ్ సహచరుల్ని ప్రోత్సహిస్తూ, తూటాలకు ఎదురువెళ్లసాగాడు.

* * *

యుద్ధవీరుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన విలేఖరి శైలేష్ రావల్, ఆ మధ్యతరగతి కుటుంబం నివసిస్తున్న ఇంట్లోకి వెళ్లి చూస్తే - అప్పటికే రాథోడ్ ఫొటోకి దండ అలంకరించి ఉంది. భార్య రాజశ్రీ కొండంత దుఃఖాన్ని గుండెలో దాచుకుని, సంప్రదాయంగా స్వాగతం పలికింది.

"మీ భర్త గురించి బాధపడుతున్నారా?" శైలేష్ రావల్ సానుభూతిగా ప్రశ్నించాడు.

"లేదు. గర్వపడుతున్నాను. ఆయన దేశం కోసం ప్రాణత్యాగం చేసారు. ఆ అదృష్టం అందరికీ రాదు. రోగాలతో, రొష్టులతో మరణించే కన్నా వీరమరణం ఎంతో గొప్పది..."

శైలేష్ రావల్ ఆమె ధీరత్వానికి ఆశ్చర్యపోయాడు. మనసారా అభినందించాడు.

"మీలాంటి ధీరవనితలే సైనికుల సాహసాలకు ప్రేరణ. దేశం సైనికుల్నేకాదు, మిమ్మల్ని కూడా గౌరవిస్తుంది" అన్నాడు చేతులు జోడించి శలవు తీసుకుంటూ. ●

('ఇండియాటుడే' సౌజన్యంతో)